## క్లుప్తంగా...

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



చార్మినార్: మరమ్మతుల కారణంగా ఖిల్వత్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని చార్మినార్ సీబీడీఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఖిల్వత్, హిమాంపురా, ఫతేదర్వాజ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

### గోల్కొండ ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రికి గత రెండు వారాలుగా రోగుల తాకిడి పెరిగింది. ఉదయం 7 నుంచే ఆస్పత్రి ఓపీ వద్ద రోగులు క్యూ కడుతున్నారు. సీజనల్ వ్యాధులతో పాటు మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా వస్తున్నారు. అయితే బస్తీ దవాఖానాలలో మెరుగైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతోపాటు వ్యాధి నిర్ధారణ పరీక్ష సౌకర్యాలు కూడా బస్తీ దవాఖానాలు ఉండకపోవడం వల్ల అందరూ ఏరియా ఆస్పత్రికే వస్తున్నారు. జ్వరంతో బాధపడే వారితో పాటు ఒంటి నొప్పులతో ఉన్న వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. ఆస్పత్రిలో ఎక్కువ మందికి మలేరియాతో పాటు టైఫాయిడ్ నిర్ధారణ అవుతుందని, వారికి సరైన మందులు అందించి పంపుతున్నామని ఆయన తెలిపారు.

### 'తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే'


అమర్ సింగ్

గోల్కొండ: తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ కార్వాన్ ప్రభుత్వ ఇన్‌చార్జి టి. అమర్ సింగ్ అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి పాలన ప్రజలకు తెలిసిపోయిందన్నారు. స్వయంగా రాష్ట్ర మంత్రులే అవినీతికి పాల్పడుతూ ప్రజాధనాన్ని లూటీ చేసుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి కూతురు మద్యం స్కాంలో విచారణను ఎదుర్కొంటున్న విషయం ప్రజలకు తెలుసని, కాగా వీరిని ప్రజలు ఏ మాత్రం క్షమించరని ఆయన అన్నారు.

### గో గీతా గానామృతం ఆవిష్కరణ


సీడీని ఆవిష్కరిస్తున్న కేవీ.రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: గోవు ప్రాముఖ్యతను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రసమయి సంస్థ ఆధ్వర్యంలో గో గీతా గానామృతం సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నంది అవార్డు పొందిన కామధేనువు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, శ్రీశ్రీశ్రీ ఆది శంకరాచార్య భక్త సమాజం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ శ్రీనివాస బంగారయ శర్మ, సంగీత దర్శకులు ఎస్.వాసురావు, లక్ష్మణరేఖ చిత్ర నిర్మాత గోపాలకృష్ణ, రసమయి అధ్యక్షులు ఎం.కె.రాము తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం


కాంగ్రెస్ నాయకులతో కురకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. మంగళవారం కార్వాన్ బాంజవాడిలో కాంగ్రెస్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుతున్నారని స్పష్టం చేశారు. బీజేపీ నాయకులే వట్టి మాటలే చెబుతున్నారే తప్పా వారికి ప్రజాబలం ఏమాత్రం లేదని, బీఆర్ఎస్‌కు బీజేపీకి తేడా ఏమీ లేదని, ఈ రెండు కూడా ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్న పార్టీలేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, ఎం.రవీందర్, రాములు, అబ్దుల్ హమీద్ ఖాన్ తదితరులున్నారు.

# ఆరోగ్య తెలంగాణే కేసీఆర్ ప్రభుత్వ ధ్యేయం


పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి తలసాని, ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, ఎమ్మెల్యే రాజాసింగ్


మంత్రి, నందుబిలాల్‌ను గజమాలతో సత్కరించిన ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

అబిడ్స్: ఆరోగ్య తెలంగాణే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్యకర జీవితం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. మంగళవారం గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని అబిడ్స్ నేతాజీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బస్తీ దవాఖానాలతో ప్రజలకు ఇంటివద్దకే వైద్యం అందిస్తున్నామన్నారు. అన్ని బస్తీలు, మురికివాడల్లో వారికి అనుకూలంగా ఉండే విధంగా బస్తీ దవాఖానా ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తుందన్నారు. వైద్య సేవల కోసం ప్రజలు లక్షలాది రూపాయలు ఖర్చు చేయకుండా వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రజలకు అన్నివిధాల ప్రభుత్వం అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకట్, కార్పొరేటర్లు డాక్టర్ సురేఖ ఓంప్రకాష్, బీఆర్ఎస్ నేతలు గడ్డం శ్రీనివాస్ యాదవ్, మమతా గుప్తా, సంతోష్‌గుప్తా, ఆనంద్‌కుమార్ గౌడ్, ధన్‌రాజ్, ఆర్‌వి.మహేందర్‌కుమార్, సురేష్ ముధిరాజ్, భీశ్వ ఓంప్రకాష్, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**సుభాన్‌పురాలో బస్తీ దవాఖానా ప్రారంభం..**

జాంబాగ్ సుభాన్‌పురాలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నూతనంగా ఏర్పాటు చేసిన మరో బస్తీ దవాఖానాను ప్రారంభించారు. జాంబాగ్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ సుభాన్‌పురా బస్తీ ప్రజల విజ్ఞప్తి మేరకు గత సంవత్సర కాలంగా మంత్రి సహకారంతో అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఈ బస్తీ దవాఖానా ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. సుభాన్‌పురా, ఆగాపురా, దర్గాయేకామూష్ ప్రాంతాల ప్రజలకు బస్తీ దవఖానా ఎంతో ప్రజనకరంగా ఉంటుందని మంత్రి తెలిపారు. మంత్రి తలసానిని, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను ఆనంద్ కుమార్ గౌడ్ గజమాలతో సత్కరించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే కౌసర్


బగ్దాద్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ, టోలిచౌకి డివిజన్లలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, నల్లాలో వచ్చే తాగునీరు సరిపోవడం లేదని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. అయితే తాగునీటికి కొరత లేదని, అప్పుడప్పుడు నీటి సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా డ్రైనేజీ పైప్‌లైన్ రీమోడలింగ్ పనులతో ప్రజలు ఇబ్బందులుపడుతున్న మాట వాస్తవమేనని, అయితే ఆ పనులు సకాలంలో పూర్తయ్యేలా చేయిస్తానని ఆయన అన్నారు.

## చెక్కుల పంపిణీ

గోల్కొండ: తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే తాను మంజూరు చేయిస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన ఆసిఫ్‌నగర్ మండలానికి చెందిన 150 షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వేలాది నిరుపేద కుటుంబాలు లబ్ధిపొందాయని ఆయన అన్నారు. వందలాది నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్లు షాదీముబారక్ కళ్యాణలక్ష్మి చెక్కుల ద్వారా జరిగాయని ఆయన అన్నారు. పలువురు మజ్లిస్ నాయకులతో పాటు ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీదేవి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సంస్కృతిని అంతర్జాతీయ స్థాయిలో నవల ప్రతిబింబింపజేసిందని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జాతీయ సాహిత్య పరిషత్ భాగ్యనగర్ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత గులాబీల మల్లారెడ్డి రచించిన ప్రేమ పవనాలు–మానవత సౌరభాలు అనే పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. వసుధైక కుటుంబాన్ని ప్రబోధించే భారత సంస్కృతి ఔనత్యాన్ని చూపిన మంచి నవల అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి, ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, రచయిత సీఎస్.రాంబాబు, కవులు చెన్నయ్య, ప్రమోద్, పరిషత్ సభ్యులు డాక్టర్ అనంత శంకర్, ఆంజనేయరాజు పాల్గొన్నారు.

## మహిళలకు సన్మానం


మహిళలచే కేక్ కట్ చేయిస్తున్న దృశ్యం

గోల్కొండ: కుటుంబంలో వృద్ధులు ఉంటే వారు కుటుంబానికి రక్షణ కవచాలుగా ఉంటారని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవార్ల వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. మంగళవారం గోల్కొండ రిసాలబజార్‌లోని శివాలయ ప్రాంగణంలో స్థానిక వృద్ధ మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు శాలువా కప్పి కేక్ కట్ చేయించారు.

## ప్రతిఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలి


సత్యభవానికి అవార్డులు అందజేస్తున్న పలువురు ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: ప్రతిఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మన స్నేహం ఎన్.ఎస్. ఫ్రెండ్స్ గ్రూప్ ఫౌండేషన్, తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు ప్రముఖులకు మన కీర్తి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కె.వాసుదేవారెడ్డి, సామాజిక వేత్త డాక్టర్ సత్యభవాని, వికలాంగుల హక్కుల సాధన సమితి అధ్యక్షులు గుత్తికొండ కిరణ్‌తో పాటు వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎలుగుబంటిని అడవిలో వదిలిన జూ సిబ్బంది

బహదూర్‌పురా: సూర్యాపేట అటవీ అధికారులు ఇంట్లో దాక్కున్న 10 ఏళ్ల మగ ఎలుగుబంటిని సోమవారం రాత్రి చాకచౌక్యంగా పట్టుకున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం నెహ్రూ జూలాజికల్ పార్కుకు తీసుకొచ్చిన ఎలుగుబంటికి పూర్తి వైద్య పరీక్షలు నిర్వహించి.. ఆరోగ్యంగా ఉండడంతో వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ ఆదేశాల మేరకు ఎలుగుబంటిని అచ్చంపేట పరిధిలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రదేశంలో మంగళవారం రాత్రి వదిలిపెట్టామని జూ క్యురేటర్ బాజీరావు పాటిల్ తెలిపారు.

## పగలు వీధి దీపాల వెలుగులు.. పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు




నాంపల్లి: యూసుఫియన్ దర్గా చౌరస్తాలో పగటి పూట కూడా వీధి లైట్లు వెలుగుతున్నాయి. వీటి నిర్వహణ లోపంతో చీటికి మాటికి వీధిలైట్లు కాలిపోతున్నాయి. ఫలితంగా ఒక్కసారి వెలుతురు లేక నెలలు తరబడి చీకట్లోనే జనాలు సంచారం చేయాల్సి ఉంటుంది. అలాగే వీధిలైట్ల కింద పని చేయాల్సిన ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయడం లేదు. పగలు పనిచేయాల్సిన ట్రాఫిక్ సిగ్నల్స్ మొండికేయడం, రాత్రి వేళల్లో వెలుగును ఇవ్వాల్సిన వీధి లైట్లు పగలు మిరుమిట్లు గొలపడం పట్ల చూసేవారు ఆశ్చర్యపోతున్నారు. దర్గాకు సమీపంలోనే నాంపల్లి కోర్టులు, నాంపల్లి మార్కెట్లు, ఆలయాలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు అధికంగా ఉండటం చేత ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఇలాంటి ప్రదేశంలో ట్రాఫిక్ సిగ్నళ్లను పునరుద్ధరించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాల్సిన అవసరం ఉంది. అలాగే పగలు వీధి లైట్లు వెలుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ


డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న నితిన్ నందకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని బీజేపీవైఎం నగర అధ్యక్షుడు నితిన్ నందకర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు విద్యార్థులకు యూనిఫామ్‌లను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న అదనపు డీసీపీ వెంకట్‌రావు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని మంగళవారం అదనపు డీసీపీ ఎం.వెంకట్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీ మహంకాళి మాతేశ్వరీ భారత మాత ఆలయం, శ్రీ కోట మైసమ్మ ఆలయ సలహాదారులు కె.ఎస్.ఆనంద్‌రావు, లాల్‌దర్వాజా ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు కె.విష్ణుగౌడ్, నాయకులు కొప్పుల అనిల్, కాశమోని శ్యాంరావు ముదిరాజ్ తదితరులు స్వాగతం పలికి పూజల అనంతరం ఘనంగా సన్మానించారు.

## అవోపా కార్యదర్శికి నంది అవార్డు


అవార్డు అందజేస్తున్న ఏసీపీ రాందాస్ తేజ

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర అవోపా కార్యదర్శి, సంఘ సేవకుడు సంబు వెంకటరమణ, ఆయన సతీమణి సంబు శోభకు నంది అవార్డు అందజేసి ఘన సత్కారం చేశారు. కొన్ని సంవత్సరాలుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న సంబు వెంకటరమణ, శోభలకు జీసీఎస్ ఒల్లూరి ఫౌండేషన్ వారు రవీంద్రబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులు బహూకరించారు. ఏసీపీ రాందాస్ తేజ, సద్గురు దైవజ్ఞ శర్మ వారికి నంది అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంబు వెంకటరమణ, శోభ మాట్లాడుతూ.. కరోనా కాలంలో సైతం అడవులలో చెంచులకు సేవలు చేయడం, కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక సేవలకు నంది అవార్డు లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజ్

అబిడ్స్: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజ్ పేర్కొన్నారు. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉంటేనే వాహనాలు నడపాలన్నారు. రహదారులపై వాహనదారులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బందికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. చిన్న చిన్న సమస్యలకు కొంతమంది వాహనదారులు భయపడి ప్రమాదాలు తెచ్చుకుంటున్నారన్నారు. ఎలాంటి సమస్య అయినా ధైర్యంగా ఎదుర్కొవాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్‌తోనే పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఐసీఐసీఐ బ్యాంకు సిబందికి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీఐసీ అకాడమిక్ ఫర్ స్కిల్స్ సెంట్రల్ హెడ్ సిమోన్, ఫ్యాకల్టీ రజినికాంత్‌రెడ్డి, దావరాణి, ట్రాఫిక్ ఎస్ఐ జ్యోతి, చక్రదర్, నరేందర్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ముఖ్య సమావేశం


కార్యక్రమంలో రమణాచారి, కాందూరి కృష్ణమాచారి తదితరులు

సుల్తాన్‌బజార్: భారతదేశంలో 29 రాష్ట్రాల్లో ఎక్కడా ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అర్చక ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గ్రాంటీన్ ఏయిడ్ ద్వారా జీతాలు అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. ఈనెల 17న బొగ్గులకుంటలోని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో జరిగే సమావేశానికి పెద్ద ఎత్తున అర్చక ఉద్యోగులు కలిసి రావాలని కోరుతూ మంగళవారం రమణాచారి ఆధ్వర్యంలో పరిషత్ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేవాదాయ శాఖలో ఉన్న 5625 మంది అర్చక ఉద్యోగులకు జీఓ నెంబర్–577 ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇస్తూ బ్రాహ్మణులకు ఎన్నో సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. మే 31న ప్రారంభం కానున్న బ్రాహ్మణ భవన్‌కు కార్యక్రమానికి సంబంధించి 17న ఉదయం 10 గంటలకు అన్ని బ్రాహ్మణ, అర్చక దేవాదాయ సంఘాలన్ని పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ పరశురామ్ రవీంద్రచార్యులు, జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, అధ్యక్షుడు బద్రీనాథ చార్యులు, ఉద్యోగ సంఘం అధ్యక్షులు కాందూరి కృష్ణమాచార్యులు, చంద్రశేఖర శర్మ, ఇతర జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## నర్సుల సేవలు ఎనలేనివి


నర్సులను సన్మానిస్తున్న సంఘం అధ్యక్ష కార్యదర్శులు శశిశ్రీ, విజయనిర్మల తదితరులు

సుల్తాన్‌బజార్: నర్సుల సేవలు ఎనలేనివని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షురాలు శశిశ్రీ అన్నారు. మంగళవారం కోఠిలోని సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ నర్సుల ముంగిపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన శశిశ్రీ కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందించిన నర్సులలో విధి నిర్వహణలో అమరులైన నర్సుల కుటుంబాలకు గౌరవ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి కోవిడ్ రోగులకు సేవలను అందించన ఘనత నర్సులదే అన్నారు. కొందరు నర్సులు కోవిడ్ బారిన పడితే మరికొందరు కోవిడ్‌తో ప్రాణాలర్పించారన్నారు. వారి సేవలు మరువలేనివయని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి టి.విజయ నిర్మల, కోశాధికారి స్ఫూర్తి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శీల, కె.పుష్ప, మేరీ మార్గరేట్, లావణ్య, లక్ష్మి, కళావతి, ప్రశాంతి పాల్గొన్నారు.

## పాత పెన్షన్ సాధన సంకల్ప దీక్షను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న నరేందర్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: ఈనెల 27న పాత పెన్షన్ సాధన సంకల్ప దీక్షను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.నరేందర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్‌లో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల మార్చిలో రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపులో భాగంగా కార్పొరేట్ మార్కెట్ నియంత్రిత శక్తుల చేతుల్లో బందీ అయిన సీపీఎస్ భూతాన్ని అంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగుల భవిష్యత్‌కు జీవితానికి భరోసా కల్పించే పాత పెన్షన్ సాధనే ధ్యేయంగా ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో సైతం సీపీఎస్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ముఖ్యమంత్రిని కోరుతూ.. ఈనెల 27న శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద పాత పెన్షన్ సాధన సంకల్ప దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులంతా ఈ దీక్షలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

## మతిస్థిమితం లేని మహిళ మృతి

జియాగూడ: మతిస్థిమితం లేని ఓ మహిళ అదే వ్యాధికి సంబంధించిన మాత్రలు అధికంగా మింగి అపస్మారక స్థితికి చేరుకుని ఉస్మానియాలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.ఐ.వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. జియాగూడ కేశవస్వామినగర్‌లో ఉంటున్న రూప (40). వీరికి ఇద్దరు సంతానం. రూపకు మతిస్థిమితం సరిగా లేని కారణంగా భర్త దిలీప్ చికిత్స ఖర్చు ఇస్తూ అత్తాపూర్‌లో తల్లివద్ద ఉంటున్నాడు. ఈనెల 13న, ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో 30 ట్యాబెట్లను మింగడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందింది.

## అధ్వాన రోడ్లతో అవస్థలు

- షేక్‌పేట్ డివిజన్‌లో గుంతలమయంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు


సూర్యనగర్ కాలనీ రోడ్డు ఇలా..

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లోని కాలనీల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గతేడాది వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లు ఇంకా అలాగే ఉన్నాయి. దీనికి తోడు గత వారం కురిసిన వర్షాలకు రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూర్యనగర్ కాలనీ, జానకీ నగర్, సమతాకాలనీల రోడ్లు, ఏజీఎస్‌ల కాలనీల రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే సమతా కాలనీ ప్రధాన రహదారిపై వరద డ్రైనేజీ నీరు కాలువలా ప్రవహిస్తోంది. ఈ కాలనీకి ఎగువ ఉన్న సత్యాకాలనీ, ఏజీఎస్‌ల నుంచి వచ్చే వర్షపు నీటితో సమతా కాలనీవాసులకు ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ పరిధిలోని సబ్జా కాలనీ రోడ్లు సైతం గుంతలమయంగా ఉన్నాయి. గతంలో సమతా కాలనీలో నివసించే ఓ విశ్రాంత అధికారి సలహా మేరకు కాలనీలో పర్యటించి వెళ్లారే తప్పా రోడ్ల వైపు మాత్రం కన్నెత్తి చూడలేరు. ఈ కాలనీలో రోడ్లు చినుకుపడితే రోడ్లపై వరదనీరు నిలిచి ఉంటున్నది.